క్లుప్తంగా

3 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బేతంచెర్ల: స్థానిక గోరిపేటలోని చెన్న కేశవస్వామి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, నాగమోహన్, నాగేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, హరి తెలిపారు. శుక్రవారం స్థానిక వికాస నిలయంలో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. 3న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, 4న కల్యాణోత్సవం, సాయంత్రం శేషవాహన సేవ, 5 హనుమద్ వాహనం, 6న ముత్యాల పందిరి, 7న గజ వాహనం, 8న గరుడ వాహనం, 9 సింహ వాహనం, 10 పల్లకీ సేవ, 11చంద్రప్రభ వాహనం, 12న రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు మురళీ, సంజీవుడు, నాగేంద్రప్ప, మధు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఏడీకి సన్మానం



వీరబ్రహ్మంను సన్మానిస్తున్న పశువైద్యాధికారులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పశు సంవర్ధకశాఖ ఏడీగా పనిచేస్తున్న వీరబ్రహ్మం ఆ శాఖ ఉప సంచాలకులుగా పదోన్నతి పొంది వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు బదిలీ కావడంతో శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోవెలకుంట్ల, గోస్పాడు మండలాల పశువైద్యాధికారులు కృష్ణకుమార్, విజయలక్ష్మి, ఉమాదేవి, కిషోర్‌కుమార్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరబ్రహ్మంను ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.హాసిని కబడ్డీ ఉమ్మడి కర్నూలు జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. ఇటీవల కర్నూలులో జరిగిన కబడ్డీ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటినట్లు చెప్పారు. ఇదే కళాశాలలో చదువుతున్న శ్రావణి జిల్లా జట్టు ప్రాబబుల్స్‌లో చోటు సంపాదించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఆదిలక్ష్మికి డాక్టరేట్

డోన్ రూరల్: మండల పరిధిలోని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి పక్కీరయ్య, కళావతి కుమార్తె ఆదిలక్ష్మి పీహెచ్‌డీ పూరి చేసింది. హైదరాబాద్‌లో తెలుగు కథా సాహిత్యం-వివాహ వ్యవస్థలో వస్తున్న పరిణామాలపై పరిశోధన పత్రాలు సమర్పించడంతో వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పేద రైతు కుటుంబంలో పుట్టి ఉన్నత చదువు పూర్తిచేయడంపై పలువురు ఆమెను అభినందించారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

కోవెలకుంట్ల: 2024–25 సంవత్సరానికి సంబంధించి వివిధ పంట కోత ప్రయోగాలపై స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఈఓలు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, ఎంపీఈఓలకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ చిదంబరం, ఏఎస్‌ఓ మద్దిలేటి పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.

సనాతన ధర్మ సంరక్షణ హిందువుల బాధ్యత



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

డోన్ టౌన్: సనాతన ధర్మ సంరక్షణ హిందువుల బాధ్యత అని శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, శ్రీవేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు కర్లె శేషావలిశర్మ అన్నారు. స్థానిక గాయత్రి పీఠంలో శుక్రవారం మహాగణపతి, దత్తాత్రేయస్వామి, లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహాగణపతి, నవగ్రహ, రుద్ర, సుదర్శన హోమాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో పురోహితులు భాస్కర్‌శర్మ, సుబ్రమణ్యంశర్మ, గంగాధర్‌శాస్త్రి, శ్రీనివాసశర్మ, సత్యనారాయణ శర్మ, ప్రణీత్‌శర్మ, శేషశయనరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

- పల్లెల్లో లోపిస్తున్న శుభ్రత
- ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగు
- మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలు
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- దృష్టి సారించని అధికారులు



ముచ్చలపురి దేవాలయం ముందు పేరుకుపోయిన మురుగునీరు



చిత్తడిగా మారిన ఆకుమల్ల మెయిన్ బజార్

సంజామల: పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం కావడంతో ఎక్కడ చూసినా మురుగునీరు పేరుకుపోయింది. రోడ్లు, వీధుల్లో మురుగు నిల్వచేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. చీకటి పడితే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. మురుగు తొలగింపు, చెత్త సేకరణ చేపట్టకపోవడంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సంజామల మండలంలో 11 సచివాలయాలు, 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో పలుచోట్ల సీసీ రోడ్లు లేక మురుగు నీరు, వర్షపు నీరు రోడ్లపై పారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేసినా డ్రైనేజీ కాల్వలు నిర్మించలేదు. ఫలితంగా మురుగునీరు, నీటి కొళాయిల నుంచి వచ్చే వృథా నీరు రోడ్లపై నిల్వ చేరుతున్నాయి. దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు, ఈగల తీవ్రత అధికమైంది. వీటితో వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు ఆందోళ చెందుతున్నారు. విష జ్వరాలతో ఇప్పటికే చాలా మంది బాధపడుతున్నారు. రోగులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

మండలంలోని చాలా గ్రామాల్లో ప్రధాన రహదారులు చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఆ చెత్తలో ఆహార అన్వేషణకు పందులు రావడం, మురుగునీరు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇదే ప్రాంతాల్లో అధికారులు తిరుగున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యను భరించలేక గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదు. అదిగో ఇదిగో అంటూ కాలం గడుపుతున్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేసి దోమల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వంద రోజుల పాలనకు నిదర్శనం

కూటమి ప్రభుత్వ అధికారంలో వచ్చి వంద రోజులు పూర్తయింది. కానీ ఏ ఒక్క పల్లెలో పారిశుద్ధ్యం పనులు చేసిన దాఖలాలు లేవు. చెత్తకుప్పలు తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. ఇది మంచి ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నేతలకు చెత్తకుప్పలు కనిపించడం లేదా అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తే బాగుంటుందని హితవుపలుకుతున్నారు. విష జ్వరాల బారిన పడుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి అంటూ ప్రచారం చేయడం తప్ప గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని మండిపడుతున్నారు.





బీసీ హాస్టల్ వద్ద చెత్తకుప్పల వద్ద పందుల సంచారం, మూలనపడిన చెత్త సేకరణ ట్రైసైకిళ్లు

ఎక్కడి వాహనాలు అక్కడే

కొలిమిగుండ్ల: నంద్యాల రవాణశాఖాధికారులు వాహనాల తనిఖీ కోసం రావడంతో శుక్రవారం ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. ఆర్టీఏ అధికారులు తిమ్మనాయినపేట, కొలిమిగుండ్లలో తనిఖీలు నిర్వహించడంతో నాపరాళ్లను రవాణ చేసే ట్రాక్టర్లు, లారీలు పెట్రోల్ బంకులతో పాటు ఆయా గ్రామాల్లోనే నిలుపుకున్నారు. దీంతో కొద్దిసేపు ప్రధాన రహదారిలో నాపరాళ్ల వాహనాలు రవాణ చేయకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. వాహనాల యజమానులు అధికారుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటునే ఉన్నారు. చివరకు మండలం నుంచి ఆర్టీఏ అధికారులు వెళ్లిపోవడంతో ట్రాక్టర్లు, లారీలు రవాణ సాగించాయి.

ట్రాక్టర్ దొంగ అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

బనగానపల్లె: ట్రాక్టర్ చోరీ చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 19వ తేదీ బనగానపల్లె మండలం ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి ఇంటి ముందు ఉంచిన ట్రాక్టర్ చోరీకి గురైందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేశామన్నారు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా తిమ్మపల్లికి చెందిన హరిషాను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

నేడు ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ పూజలు

డోన్/బేతంచెర్ల: తిరుమల లడ్డూపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ఉదయం 9 గంటలకు పాదయాత్రగా వెళ్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. చంద్రబాబు చేసిన పాపం ప్రజలపై పడకుండా ప్రాయిశ్చిత్త పూజలను చేస్తామన్నారు. అలాగే బేతంచెర్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే పూజలకు బుగ్గన హాజరుకానున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

బనగానపల్లె: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కలియుగదైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కూటమి ప్రభుత్వం అసత్య ఆరోపణలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాని కోరారు.

తిమ్మరాజు చెరువు కట్టపై ఆందోళన వద్దు

- నెలలో సమస్యను పరిష్కరిస్తాం
- లీకేజీ ప్రదేశాన్ని పరిశీలించిన మంత్రి బీసీ, కలెక్టర్ రాజకుమారి



లీకేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి బీసీ, కలెక్టర్, డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్

అవుకు: తిమ్మరాజు చెరువు కట్టకు పెద్ద ప్రమాదం ఏమీ లేదని డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్ తెలిపారు. అవుకు రిజర్వాయర్‌లో భాగమైన తిమ్మరాజు చెరువు కట్ట రివెట్‌మెంట్ కుంగడం, కట్ట కింద నీరు లీకేజీ అవుతున్న విషయం విదితమే. ప్రజలు భయాందోళనకు గురవుతుండడంతో ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్ శుక్రవారం తిమ్మరాజు చెరువు కట్ట, లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్ మాట్లాడుతూ.. తిమ్మరాజు చెరువును అవుకు రాజులు నిర్మించారని గుర్తు చేశారు. రిజర్వాయర్‌కు రెండు స్లూయిస్‌లు ఏర్పాటు చేశారన్నారు. అయితే ఒక స్లూయిస్‌ను తీసివేసి మరో చోట ఏర్పాటు చేశారని తెలిపారు. తీసేసిన స్లూయిస్ వద్ద సిమెంట్ నిర్మాణం కొద్దిగా దెబ్బతినడం వల్ల నీరు పోతోందని చెప్పారు. నీటి లీకేజీ కొన్నేళ్లుగా ఉందన్నారు. దీని వల్ల ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. అలాగే రిజర్వాయర్‌లో నీరు అధికంగా ఉంచడం వల్ల చెరువు కట్ట రివెట్‌మెంట్ సుమారు మీటరున్నర వరకు కుంగిందని, ప్రస్తుతం కుంగిన ప్రదేశాన్ని మట్టితో కప్పేశామన్నారు. రిజార్వాయర్‌లో నీటిని తగ్గించి లీకేజీ సమస్యను, రివెట్‌మెంట్ సమస్యను నెలలోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. డ్యాం సేఫ్టీ బృందం ఎప్పటికప్పుడు కట్టను పరిశీలిస్తుందన్నారు. కట్ట కుంగిన సమయంలో సంబంధిత అధికారి సరిగ్గా స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నామని మంత్రి బీసీ తెలిపారు. వారి వెంట చీఫ్ ఇంజినీర్ బాషా, ఎస్‌ఈ వరప్రసాద్, ఎస్సార్‌బీసీ ఈఈ సురేష్ బాబు, టీడీపీ నాయకులు ఉన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీకి సత్కారం



ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: పట్టణానికి చెందిన వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులను పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, ప్యాపిలి ఎస్ఐ నరేంద్రలు స్టేషన్‌లో శుక్రవారం సత్కరించారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించినందుకు అభినందించారు. కమిటీ అధ్యక్షుడు కొత్రికె ఫణిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమణ, వైస్ చైర్మన్ హరికిషన్, ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఉన్నారు.

మందుల దుకాణాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

డోన్ రూరల్: పట్టణంలోని మారుతి ఫర్టిలైజర్, విజయ్ స్టోర్స్‌లను శుక్రవారం ఆత్మకూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనేయ తనిఖీ చేశారు. దుకాణంలో నిల్వ ఉన్న స్టాకు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ ఉన్నారు.

యాగంటి ఈఓ బాధ్యతల స్వీకరణ



ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ ఈఓగా డీఆర్‌కేవీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాల్వలో ఈఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన 2022లో యాగంటి ఈఓగా పనిచేశారు. కాగా ఇక్కడ ఈఓగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని ఓర్వకల్లు గ్రూపు టెంపుల్స్ ఈఓగా బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్ రెడ్డి, కొత్తగా వచ్చిన డీఆర్‌కేవీ ప్రసాద్‌ను ఆలయ సిబ్బంది, అర్చకులు ఘనంగా సన్మానించారు. అర్చకులు మహేంద్రశర్మ, సత్యనారాయణశర్మ, లోక్‌నాథ్‌శర్మ పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనుల అడ్డగింపు



దుర్గాపేట కాలనీలో ఏర్పాటు చేస్తున్న టవర్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీలో ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణ పనులను శుక్రవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. గతంలో ఉన్న టవర్ నుంచి వస్తున్న రేడియేషన్ కారణంగా ఇప్పటికే పలువురు మృతిచెందారని.. మరికొందరు అనారోగ్యానికి గురయ్యారని స్థానికులు భాగ్యమ్మ, నడిపక్క, లక్ష్మమ్మ, విమలక్క, శివ, సరోజ ఆరోపించారు. నగర పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి సెల్ టవర్ నిర్మాణ పనులను ఆపివేయాలని కోరారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికలు అండర్–14, 17 నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ శుక్రవారం ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి సుమారు 750 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్లు, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు బయ్యన్న, భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా మాజీ మంత్రి బుగ్గన జన్మదినం





ప్యాపిలి: విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న నాయకులు, బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురంలో కేక్ కట్ చేస్తూ..

ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ రావూరి పద్మావతి, ఉప సర్పంచ్ రావూరి ధనుంజయ శెట్టి తదితరులు నోటు పుస్తకాలు, పలకలు, స్వీట్లు పంపిణీ చేశారు. వార్డు సభ్యులు ఆదెమ్మ, లక్ష్మణ్, రాణి, మనోహర్, శివకుమారి పాల్గొన్నారు.

- **బేతంచెర్ల:** మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అన్నదానం చేశారు. నాయకులు గంగాధర్‌రెడ్డి, గుర్రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం, హరినాథ్ రెడ్డి, తిమ్మయ్య సంజీవరెడ్డి, కత్తి మద్దిలేటి, హుసేన్ బాషా పాల్గొన్నారు.

ధర్మవరం సుబ్బారెడ్డి బలప్రదర్శన

డోన్: తెలుగుదేశం పార్టీకి చెందిన ధర్మవరం సుబ్బారెడ్డి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యాక మొదటిసారిగా శుక్రవారం డోన్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో తన వర్గీయులతో బలప్రదర్శనకు దిగారు. ఆయనకు అనుచరులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. డోన్ నియోజకవర్గానికి బయలుదేరే ముందు కర్నూలులో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మతో పాటు పలువురు టీడీపీ నాయకులను కలిశారు. డోన్‌లో మాత్రం కోట్ల కుటుంబీకుల ప్రమేయం లేకుండానే ఓపెన్ టాప్‌లో బయలుదేరి ప్రజలకు అభివాదం చేస్తూ కోట్ల కన్నా తనదే పైచేయి అని నిరూపించేందుకు ప్రయత్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరిన వారు పెత్తనం చేస్తామంటే సహించేది లేదని సుబ్బారెడ్డి హెచ్చరించారు. మూడేళ్లుగా పార్టీ అభ్యున్నతి కోసం పని చేసిన కార్యకర్తలను కాదని ఎన్నికల ముందు కోట్ల వెంట వచ్చిన ఎర్రన్నలు అధికారం చెలాయిస్తామంటే కుదరదన్నారు. ఈ విషయంపై కోట్లతో చర్చించేందుకు సైతం తాను సిద్ధం అన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముద్దవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన భాస్కర్ ద్విచక్రవాహనంపై బేతంచెర్ల పట్టణానికి వచ్చి తిరిగి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ విజయ్ గమనించి చికిత్స నిమిత్తం బేతంచెర్ల ఆస్పత్రికి తరలించారు. ఇదే గ్రామానికి చెందిన చిన్న తిరుపాల్ మేకలను అడవికి తోలుకెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల: అనారోగ్య, కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బెల్లం సుబ్బారెడ్డి(45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడం, కుటుంబ సమస్యలతో మనస్తాపంతో ఉన్నాడు. గురువారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప శుక్రవారం తెలిపారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన శాంతమ్మ అనే మహిళ ఈ ఏడాది ఫిబ్రవరిలో జొన్న పంట సాగు చేసి పైరు కోస్తుండగా ఇదే గ్రామానికి చెందిన వెంకటరాముడు, శివన్న, మహేశ్వరి అలియాస్ రాజేశ్వరి, భాస్కర్ పొలం వద్దకు చేరుకుని కులం పేరుతో దూషించి తనను చంపుతామని బెదిరించినట్లు ఇటీవల బాధిత మహిళ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- ఎనిమిది మందిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చినా పెళ్లి అయిన రెండేళ్లకే అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో బాధిత మహిళ శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మహేశ్వరికి ఇదే పట్టణానికి చెందిన వెంకటేష్‌తో 2022లో వివాహం జరిగింది. కొంత కాలం నుంచి అదనపు కట్నం తేవాలని భర్త, అత్తమామలు, బంధువులు వేధింపులకు గురి చేస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలు, బంధువులైన పుణ్యవతి, శేఖర్, వెంకటసుబ్బయ్య, నాగజ్యోతి, ఎల్లరాజు, పి. రాజు, నాగేశ్వరమ్మపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా బీటర్ అరెస్ట్

అవుకు: మండల పరిధిలోని రామాపురం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో శుక్రవారం మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన బోయ రామభూపాల్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మట్కా చీటీలు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ కోరారు. త్వరలో కళాశాలను న్యాక్‌బృందం సందర్శించనున్న దృష్ట్యా శుక్రవారం కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సన్నిధి చంద్రశేఖర్ కళాశాల అభివృద్ధికి రూ. 50 వేలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్: కర్నూలు జిల్లా వెల్దుర్తిలో మృతిచెందిన 50 ఏళ్ల గుర్తు తెలియని శవానికి పోలీసుల కోరిక మేరకు డోన్ ద్రోణాచలం సేవా సమితి సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. చరణ్‌తేజ్‌రెడ్డి ఆర్థిక సహాయం చేయగా రాజయ్యగౌడ్ వాహనాన్ని సమకూర్చినట్లు సభ్యులు తెలిపారు.

ఘనంగా మద్దిలేటయ్య తిరుచ్చి ఉత్సవం



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారి తిరుచ్చి ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారిని కొలువుంచి డోలు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, జ్వాలా చక్రవర్తి, ప్రధాన అర్చకులు మద్దిలేటిస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.